సాక్షి శ్రీకాకుళం



పేదపిల్లలకు కార్పొరేట్ విద్య

ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు లభించనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. - 8లో



రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు

రిమ్స్ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు గురువారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు వైద్యులు విధుల్లో చేరారు. - 8లో

నేడు టెక్కలిలో జాబ్‌మేళా

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల జేకేసీ సెంటర్, కృష్ణపట్నం సెక్యూరిటీ సర్వీసెస్, విశాఖపట్నం, విజయనగరం పేటీఎం సంస్థ సంయుక్తంగా ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన సుమారు వంద మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 9 గంటలకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

న్యూస్‌రీల్

బీఎస్సీ పారా మెడికల్ కోర్సుల్లో ఉచిత అడ్మిషన్లు

శ్రీకాకుళం రూరల్ : జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్‌లో బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో ఉచితంగా అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. బీఎస్సీ ట్రాన్సిషన్ టెక్నాలజీ, రేడియోథెరపీ టెక్నాలజీ, ఫిజీషియన్ అసిస్టెంట్ టెక్నాలజీ, కార్డియాకేర్, పెర్ఫ్యూషన్, రేడియాలజీ ఆప్టో మెట్రి, న్యూరో ఫిజియాలజీ, డయాలసిస్, రెసిపిరేటరీ, మెడికల్ రికార్డ్స్ టెక్నాలజీ తదితర కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని,ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు అర్హులని, వివరాలకు 7995013422, 9121999654 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కేసుల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించడమే లక్ష్యమని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు శ్రీకాకుళంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు జ్ఞాన సువర్ణ రాజు ఆధ్వర్యంలో ప్రతిరోజూ ప్రీ లోక్ అదాలత్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రిమినల్, మోటారు ప్రమాద కేసుల్లో కక్షిదారులను పిలిపించి రాజీ చేసేందుకు ప్రయత్నాలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నాబార్డు మేనేజర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కుప్పిలి వరప్రసాద్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్‌ను నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ కుప్పిలి వరప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నాబార్డుకు సంబంధించి వివరాలను తెలియజేశారు.

3న పల్స్‌పోలియో



అరసవల్లి: జిల్లాలో వచ్చే నెల 3న పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి తెలిపారు. జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో బుధవారం వైద్యాధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 2,33,823 మందికి పోలియో నివారణ చుక్కలు వేయాల్సి ఉందని చెప్పారు. ఇందుకోసం 1634 బూత్‌లు, 50 ట్రాన్సిస్ట్ బూత్‌లు, 98 మొబైల్ బూత్‌లు, 160 సూపర్‌వైజర్ల బృందాలను సిద్ధం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో డీఐవో ఈశ్వరి దేవి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాశరావు పాల్గొన్నారు.

సేవా సేనలకు సత్కారం

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. ఆమదాలవలస, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, టెక్కలి నియోజకవర్గాల్లో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సత్కరించారు.

– ఆమదాలవలస/శ్రీకాకుళం రూరల్/గార/కొత్తూరు/ఎచ్చెర్ల/టెక్కలి



సేవలు నిరుపమానం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్లు గురుతర బాధ్యత పోషిస్తున్నారు.

–తమ్మినేని సీతారాం, శాసన సభ స్పీకర్

(బూర్జ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో)



దేశానికే ఆదర్శం

కరోనా వంటి కష్టకాలంలో గ్రామ వలంటీర్లు ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించారు. పలు రకాల సర్వేలు చేసి అధికార యంత్రాంగానికి చేయూతగా ఉంటున్నారు. వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శం.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

(కొత్తూరు ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో..)

విప్లవాత్మకం..

గత ప్రభుత్వంలో సంక్షేమ పథకం అందాలంటే జన్మభూమి కమిటీలు, రాజకీయ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ ప్రభుత్వ పాలనలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పథకాలు చేరుతుండటం విప్లవాత్మకం.

– దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి

(టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో..)





ఇచ్చిన మాట ప్రకారం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేశారు. 50 కుటుంబాలకు సేవా దృక్పథం గల వలంటీరును నియమించి పూర్తిస్థాయిలో పథకాలు అందిస్తున్నాం. – ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

(అంపోలు రోడ్డులోని సిస్టం కాలేజీలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో)



ప్రజా ప్రభుత్వం..

గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలను నియమించి దోపిడీకి తెరతీసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

(లావేరులో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో)

నేనున్నానని..

సోంపేట బాలికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న కొవ్వూరి మౌనిక కొంతకాలంగా తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. బుధవారం పాఠశాలకు వెళ్లిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ విద్యార్థినిని అక్కున చేర్చుకుని ధైర్యంచెప్పారు. అమ్మానాన్నలు, తోటి విద్యార్థులు, అందరం తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనారోగ్యం గురించి చింతించకుండా బాగా చదువుకుని ఆనందంగా జీవితం గడపాలని ఆకాంక్షించారు. – సోంపేట



విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరగాలి



సూచనలిస్తున్న రాష్ట్ర పరిశీలకుల బృందం

హిరమండలం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నందున, చిన్నారుల్లో లైఫ్ స్కిల్స్ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర పరిశీలకుల బృందంతో కలిసి బుధవారం హిరమండలం మండలంలోని సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల, అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించారు. అభ్యసనా అభివృద్ధి(లిప్) కార్యక్రమ తీరుతో పాటు తరగతి గదిలో బోధనా పద్ధతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎంఓ లక్ష్మీనారాయణ, రాష్ట్ర బృందం సభ్యులు ప్రవీణ్‌కుమార్, రమేష్ చంద్ర, ఎంఈఓ కె.రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఎంపీపీ చిరంజీవి సస్పెన్షన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవిని వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సస్పెన్షన్ విధించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9న ఎచ్చెర్ల మాజీ సర్పంచ్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జరుగుళ్ల విజయకుమారి భర్త శంకరరావుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేశారు. ఈ కేసులో చిరంజీవిని ఏ-1 నిందితునిగా పేర్కొంటూ పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం చిరంజీవి రిమాండ్‌లో ఉన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 133 మందికి ఉద్యోగాలు



ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం చెన్నైకి చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్, విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆమదాలవలస పాలిటెక్నిక్, ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ప్రైవేట్ పాలిటెక్నిక్, టెక్కలిలోని శ్రీ ఆదిత్య ప్రైవేట్ పాలిటెక్నిక్, చిలకపాలెంలోని శ్రీశివానీ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచిలకు చెందిన 256 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా 133 మందికి ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. రూ.18వేలు ప్రారంభ వేతనం, ఇతర సౌకర్యాలతో పాటు ఉన్నత విద్య చదివేందుకు సైతం అనుమతించనున్నట్లు కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు అరుణ్‌కుమార్, విక్టర్ తెలిపారు. సీనియర్ అధ్యాపకులు గురుగుబెల్లి దామోదర్‌రావు, యుగంధర్, మురళీకృష్ణ పర్యవేక్షించారు.

ఇది మా భవితకు సపోర్టు

- ఈ ప్రాంతంలో పోర్టు వస్తుందని ఊహించలేదు
- సీఎం వైఎస్ జగన్ కృషి కనిపించింది
- మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనుల సందర్శన అనంతరం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల మనోగతం





మూలపేట వద్ద శరవేగంగా జరుగుతున్న పోర్టుపనులు

'మా ప్రాంతంలో పోర్టు వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు.. మా చిన్నప్పటి నుంచి పోర్టు అంటున్నారు గానీ ఎవరూ కట్టలేదు. ఇప్పుడు ఇక్కడ పనులు చూస్తుంటే సీఎం వైఎస్ జగన్ కృషి తెలుస్తోంది. ఇక్కడ పోర్టుతో మా భవిష్యత్ కనిపిస్తోంది.' ఇదీ మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టును ఇటీవల సందర్శించిన టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల మనోగతం. పోర్టు పనులు చూసి ఆశ్చర్యపోయిన విద్యార్థులు పనులన్నీ పూర్తయ్యాక తమలాంటి వారికి ఇక్కడే ఉపాధి దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన 59 మంది విద్యార్థులు ఇటీవల సంతబొమ్మాళి మండలంలోని మూలపేట పోర్టు ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ పోర్టు నిర్మాణాన్ని చూసి ఎంతో ఆశ్చర్యపోయారు. వెనుకబడిన జిల్లాలో ఇంతటి నిర్మాణాన్ని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అంతా రుణపడి ఉంటామని వారు అన్నారు. పోర్టు నిర్మాణంతో జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 'మా ప్రాంతంలో పోర్టు నిర్మాణం జరుగుతుందనే విషయాన్ని వివిధ మీడియాల్లో చూస్తున్నాం తప్ప నేరుగా చూడలేదు. ఇలాంటి పోర్టు వల్ల పెద్ద ఎత్తున ఎగుమతులు, దిగుమతులు జరిగి మా లాంటి యువతకు కచ్చితంగా ఉపాధి అవకాశాలు వస్తాయి' అని అన్నారు.

భవిష్యత్ కనబడింది



మూలపేట పోర్టు నిర్మాణం చూసిన తర్వాత ఈ ప్రాంతంలో మా లాంటి యువతకు బంగారు భవిష్యత్ కనబడింది. విశాఖలో పోర్టు ఉండడంతో ఆ ప్రాంతం ఎంత అభివృద్ధి చెందిందో అందరికీ తెలుసు. భవిష్యత్‌లో మన ప్రాంతంలో అంతకంటే ఎక్కువ అభివృద్ధి జరుగుతుంది. – ఆర్.తరంగిణి, బీఎస్సీ సెకండియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి.

జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి



మూలపేట పోర్టు నిర్మాణం ఎంతో శరవేగంగా జరుగుతోంది. జిల్లా అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు అనే విషయానికి ఈ పోర్టును నిదర్శనంగా చెప్పాలి. పోర్టు వల్ల ఈ ప్రాంతంలో అన్ని వర్గాల జీవన ప్రగతి మరింత మెరుగుపడుతుంది. – చౌదరి సుగుణధనరావు, లెక్చరర్.



సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు ప్రాంతాన్ని సందర్శిస్తున్న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రభుత్వానికి హ్యాట్సాఫ్



మారుమూల ప్రాంతంలో పోర్టు నిర్మాణం చేపట్టడం ఎంతో గొప్ప విషయం. పోర్టు నిర్మాణం జరిగిన తర్వాత దానికి అనుకూలంగా ఎన్నో రకాల పరిశ్రమలు, ఇతర వర్తక, వాణిజ్య వ్యాపారాలకు ఈ ప్రాంతం సెంటర్ పాయింట్ అవుతుంది. మా చిన్నప్పటి నుంచి పోర్టు అంటున్నారే తప్పా ఎప్పుడూ నిర్మాణం చేయలేదు. మొట్టమొదటి సారిగా సీఎం వైఎస్ జగన్ ఇలాంటి పోర్టు నిర్మాణం చేస్తున్నారు. ఈ ప్రభుత్వానికి హ్యాట్సాఫ్.

– వై.మహేష్, బీఎస్సీ విద్యార్థి

నిరుద్యోగ సమస్య తీరుతుంది



పోర్టు నిర్మాణం జరిగిన తర్వాత జిల్లాలో నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. పోర్టు నిర్మాణం తర్వాత ఏ రకంగా ఎగుమతులు, దిగుమతులు జరుగుతాయో అక్కడ సిబ్బంది వివరించారు. ఇంతకు మునుపెన్నడూ పోర్టు చూడలేదు. మా ప్రాంతంలో నిరుద్యోగ సమస్య తీరడమే కాకుండా ఎంతో అభివృద్ధి జరుగుతుందని మాకు నమ్మకం కలిగింది.

– కె.హరిప్రియ, బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థిని.


విద్యార్థులకు ఉపయోగకరం



పోర్టు సందర్శన మా కళాశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న మంచి పని విద్యార్థులకు తెలిసింది. జిల్లాలో మొట్టమొదటి సారిగా మా కళాశాల విద్యార్థులే ఈ పోర్టును సందర్శించి అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు.

– టి.గోవిందమ్మ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి

కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపలకు ఘన స్వాగతం



కళింగ కార్పొరేషన్ చైర్మన్ రామారావుని సత్కరిస్తున్న అభిమానులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్ర కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై బుధవారం తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన దుంపల రామారావు (లక్ష్మణరావు)కు పైడిభీమవరం వద్ద అభిమానులు సుమారు 200 కార్లతో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి చిలకపాలెం, లోలుగు, రాపాక, పొందూరు, తోలాపి, కింతలి కనిమెట్ట తదితర గ్రామాల వద్ద అభిమానులను కలుస్తూ తోలాపి చేరుకొని కుటుంబ సభ్యులను కలిశారు. అనంతరం శ్రీకాకుళం సింహద్వారం వద్ద ఉన్న దివంగత నేత బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం నగరంలోని తన స్వగృహానికి చేరుకుని విలేకరులతో మాట్లాడారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా తనను నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను విధిగా నిర్వహించి కళింగ సామాజిక వర్గానికి, వైఎస్సార్‌సీపీకి ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలు చేపడతానని చెప్పారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, రామారావు టీచర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజాసేవకోసం స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉంటూ బీసీల సమస్యలపై పోరాటం సాగించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రామారావు రెండేళ్ల పాటు కార్పొరేషన్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.



జాతీయ రహదారిపై కార్లతో స్వాగతం పలికిన అభిమానులు

ఎన్నికల ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల ఫిర్యాదులపై ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1950ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 34వ వారపు సమావేశంలో భాగంగా బుధవారం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి మాట్లాడారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు 1800 425 6625 నంబర్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ నోడల్ అధికారి అందుబాటులో ఉంటారని తెలిపారు. గత నెల రోజులకు సంబంధించి 2,66,194 నూతన ఓటరు కార్డులు ముద్రణ కోసం పంపామని, వీటిలో 1,08,836 కార్డుల ముద్రణ పూర్తవ్వగా, పోస్టల్ శాఖ ద్వారా ఆయా ఓటర్ల ఇళ్లకే చేరవేశామని జేసీ పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, రౌతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పి.ఎం.జె.బాబు (టీడీపీ), దేశెళ్ల మల్లిబాబు (కాంగ్రెస్), సురేష్ బాబు సింగ్ (బీజేపీ) పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏకగ్రీవంగా ఎలక్ట్రిసిటీ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104) టెక్కలి డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నరసన్నపేటలోని కల్యాణ మండపంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం.వి.గోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షునిగా దాసరి శేఖర్, కార్యదర్శిగా నక్క లోకేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నెపు గోపాల రత్నం, కోశాధికారిగా మెట్ట హిమగిరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఈశ్వరరావు, ఆఫీస్ కార్యదర్శిగా మెట్ట కరుణాకర్, కమ్యూనికేషన్ కార్యదర్శిగా వై.వాసుదేవరావు ఎన్నికయ్యారు.

ఆదిత్యుని సన్నిధిలో ఆదిపరాశక్తి పీఠాధిపతి



స్వామీజీకి జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి నిత్యావిద్యానంద భారతి స్వామీజీ తన శిష్య బృందంతో బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రైలు స్టాపేజీలు ఇవ్వాలని వినతి



డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘ నాయకులు

కాశీబుగ్గ: సోంపేట స్టేషన్‌లో ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య రైలు స్టాపేజీ కల్పించాలని బీసీ సంఘం నాయకులు బుధవారం ఖుర్దా రోడ్డు డీఆర్ఎంకు వినతిపత్రం అందించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పనుల మీద వెళ్లేవారు, అనారోగ్యంతో ఆసుపత్రులకు పోయేవారు ఉదయం రైలు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఢిల్లీ రావు, నాయకులు అమీరుల్లా బేగ్, బద్రి సీతమ్మయాదవ్, పల్లి నాగేశ్వరరావు, పురిల్ల మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

పొందూరు: త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుండటంతో మండలంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మ గ్రామాలపై పోలీసులు దృష్టి సారించాలని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. పొందూరు పోలీసు స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వివాదాలు చోటుచేసుకోకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రికార్డులను పరిశీలించి ఎస్సై రవికుమార్‌కు తగు సూచనలు, సలహాలిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆమదాలవలస: మండలంలోని శ్రీహరిపురం సమీపంలో అలికాం –బత్తిలి రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం మండలం రాగోలు గ్రామానికి చెందిన సంపతిరావు కృష్ణమూర్తిరాజు వాహనానికి.. ఎదురుగా వస్తున్న భామిని మండలం కాట్రగడ్డ గ్రామానికి చెందిన ఎస్.సునీల్‌కుమార్ బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడటంతో 108 సిబ్బంది ఎం.రమేష్, ఎం.అంజిబాబు ప్రథమ చికిత్స అందించి జొన్నవలస పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీచుమిల్లులో అగ్ని ప్రమాదం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బలరాంపురం జంక్షన్ వద్ద పీచుమిల్లులో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న ఇచ్ఛాపురం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ.70వేల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపకాధికారి సూర్యారావు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పాలకొండ రోడ్డులో ఓ ఎలక్ట్రికల్ షాపు వెనుక ఖాళీ స్థలంలో బుధవారం పేకాట ఆడుతూ ఐదుగురు జూదరులు పోలీసులకు పట్టుబడినట్లు రెండో పట్టణ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.17585 నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

● సీహెచ్‌సీ భవనాలు ప్రారంభం



భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: సోంపేట పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం నాబార్డు నిధులు రూ.4.60 కోట్లతో నిర్మించిన సామాజిక ఆసుపత్రి భవనాల నూతన సముదాయాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌లు మాట్లాడుతూ నూతన భవనం, పూర్తిస్థాయి వైద్యుల నియామకంతో కార్పొరేట్‌కు దీటుగా ఆసుపత్రి సిద్ధమైందని చెప్పారు. సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోషియేషన్ సోంపేట అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, సంఘ సభ్యులు డాక్టర్ ఎ.వి రామకృష్ణ, డాక్టర్ పి.రమేష్ మాట్లాడుతూ సోంపేట లో ఇటువంటి ఆసుపత్రి భవనాలు నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ టి.వెంకటేష్, పార్టీ నాయకులు నర్తు శివాజీ, శిలగాన భాస్కరరావు, మద్దు రాజారావు, బతకల మోహనరావు, బుద్దాన శ్రీకృష్ణ, రౌతు విశ్వనాథం, పాడుగు కామేష్, నగిరి ప్రభావతి, తామాడ పద్మావతి, వైద్య సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్



లోలుగులో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు : ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. లోలుగు గ్రామంలో రూ.79.30 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం భవనాలను బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ లోలుగు ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ ఈ అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అనంతర లోలుగు కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, నాయకులు కిల్లాన సూర్యారావు, లోలుగు లక్ష్మున్నాయుడు, బండారుప్రతాప్, అనకాపల్లి గోవిందరావు పాల్గొన్నారు.

ఇదీ కదా.. అభివృద్ధి

● ప్రభుత్వ విద్యకు పెద్దపీట



పాఠశాల భవనాలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్లపాలనలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట బాలికోన్నత పాఠశాలలో నాడు-నేడు ఫేజ్ -1లో భాగంగా రూ.1.66 కోట్లతో నిర్మించిన అదనపు భవనాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారాయని చెప్పారు. 9వ తరగతి విద్యార్థిని పసుపురెడ్డి శ్రీలేఖ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఇంతబాగా మునుపెన్నడూ చూడలేదని, నోట్ పుస్తకాలు, బ్యాగులు, ట్యాబ్‌లు, జగనన్న గోరుముద్ద, నూతన భవనాలు నిర్మించి జగన్ మామయ్య చరిత్ర సృష్టించారని ఆనందం వ్యక్తం చేసింది.

● పోర్టులో 50 వేల ఉద్యోగాలిస్తాం



చిన్నహరిశ్చంద్రపురంలో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభిస్తున్న దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్

కోటబొమ్మాళి : సంతబొమ్మాళి మండలంలోని మూలపేట పోర్టు పనులు పూర్తయితే జిల్లాలోని నిరుద్యోగులకు 30 వేలుతో పాటు ఒక్క టెక్కలి నియోజకవర్గంలో 20 వేల ఉద్యోగాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్, శ్రీకాకుళం పార్లమెంటరీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. బుధవారం కోటబొమ్మాళి మండలం చిన్న హరిశ్చంద్రపురంలో రూ. 21.50 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నూక సత్తిరాజు, సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపీటీసీలు బగాది దివాకర్, పూజారి సత్యం, వాన అసిరినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, పార్టీ నాయకులు సుంకరి జనార్దన, తర్ర కామినాయుడు, మెండ నర్సింగరావు, బొడ్డు వెంకటరమణ పాల్గొన్నారు.

పేద పిల్లలకు కార్పొరేట్ విద్య

- విద్యాహక్కు చట్టం అమలుకు పకడ్బందీ చర్యలు
- ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు
- 2024-25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ఒకటో తరగతిలో ప్రవేశాలకు అవకాశం



తరగతి గదిలో విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చదివే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యా సంవత్సరం(2024–25)కి సంబంధించి ప్రవేశాలకు ముందస్తుగా నోటిఫికేషన్ విడుదల చేసింది. 'విద్యాహక్కు చట్టం–2009 సెక్షన్ 12(1)–సి'ని అనుసరించి ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు వరం..

ప్రభుత్వ నిర్ణయంతో విద్యాహక్కుచట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు 1వ తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. వాస్తవానికి విద్యాహక్కుచట్టం -2009 ప్రకారం ఏటా ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాల్సి ఉన్నా గత పాలకులు దీన్ని పట్టించుకోలేదు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. శ్రీకాకుళం జిల్లాలో 398 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్సీ, స్టేట్ సిలబస్ అమలవుతున్న పాఠశాలల్లో 25 శాతం సీట్లు 1వ తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంది. ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నెల 6 నుంచి సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ కావాలని పాఠశాల విద్య కమిషనర్ మార్గదర్శకాలు జారీ చేశారు.

ఇదీ షెడ్యూల్..

- ఫిబ్రవరి 23 నుంచి మార్చి 14 వరకు స్టూడెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది.
- సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ ఆఫ్ ఐబీ, ఐఈఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలయ్యే ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- దరఖాస్తుతోపాటు తల్లిదండ్రుల ఆధార్/ఓటర్/ రేషన్/ భూహక్కు /ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు/పాస్‌పోర్ట్ / డ్రైవింగ్ లైసెన్స్/ విద్యుత్ బిల్లు/ రెంటల్ అగ్రిమెంట్ కాపీల్లో ఒకదానిని జత చేయాలి.
- మార్చి 20 నుంచి 22 వరకు అర్హులైన విద్యార్థులను గుర్తిస్తారు.
- ఏప్రిల్ 1న లాటరీ ద్వారా అర్హుల మొదటి విడత జాబితా తయారుచేస్తారు.
- ఏప్రిల్ 2 నుంచి 10 వరకు విద్యార్థుల అడ్మిషన్లు ఖరారు చేస్తారు.
- ఏప్రిల్ 15న లాటరీ ద్వారా రెండో విడత జాబితాను వెల్లడిస్తారు.
- ఏప్రిల్ 16 నుంచి 23 వరకు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు ఖరారు చేస్తారు.



పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌పోర్టల్

సద్వినియోగం చేసుకోవాలి..



విద్యాహక్కుచట్టం ప్రకారం పేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించింది. ఇది పేద, మధ్య తరగతి విద్యార్థులకు వరమనే చెప్పాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కె.వెంకటేశ్వరరావు, డీఈవో, శ్రీకాకుళం

సకాలంలో పనులు పూర్తి చేస్తాం



సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 448 గ్రామాలకు తాగునీరు అందించేందుకు శంకుస్థాపన చేసిన పనులు గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. బుధవారం విశాఖపట్నం వచ్చిన సీఎంను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. మెళియాపుట్టి, పాతపట్నం, ఎల్.ఎన్.పేట, హిరమండలం, కొత్తూరు మండలాల్లోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు వంశధార జలాలను అందిస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.265 కోట్లతో పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేశామని వివరించారు. పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు ఇస్తానని, నిరంతర పర్యవేక్షణతో పనులు జరిగేలా చూసుకోవాలని సీఎం తెలియజేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

చిన్నారులకు చేయూత

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచి గ్రామానికి చెందిన మల్లవరపు వెంకటలక్ష్మీ అనే వివాహితను ఆమె భర్త విడిచిపెట్టగా.. సంక్రాంతి నాడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంది. 4, 2 తరగతులు చదువుతున్న కుమార్తెలు శరణ్య, లిఖితలు అనాథలుగా మిగిలిపోయారు. ఈ విషయమై 'సాక్షి'లో ప్రచురితమైన 'అమ్మ లేదు.. నాన్న రాడు' అనే కథనానికి దాతలు స్పందిస్తున్నారు. కేశుపురం గ్రామానికి చెందిన 'శ్రీకాళీమాత సేవాసమితి' సభ్యులు బుధవారం రూ.12వేలు నగదు, నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందజేశారు.



చిన్నారులకు సాయం అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

అచ్చెన్నాయుడి రిగ్గింగులు సాగనివ్వం



హరిశ్చంద్రపురం వైస్‌సర్పంచ్ రామారావుకు వైఎస్సార్ సీపీ కండువా వేస్తున్న దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్

కోటబొమ్మాళి : రానున్న ఎన్నికల్లో నిమ్మాడ సమీప గ్రామాల్లో అచ్చెన్నాయుడి రిగ్గింగులు సాగనివ్వబోమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్, శ్రీకాకుళం పార్లమెంటరీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. బుధవారం కోటబొమ్మాళి మండలం చిన్న హరిశ్చంద్రపురంలో వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హరిశ్చంద్రపురం వైస్ సర్పంచ్ మొగిలి రామారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు సోమవారం తమ గ్రామానికి వచ్చి బలవంతంగా టీడీపీ కండువా వేశారని, తనకు జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఇష్టమని, అందుకే మళ్లీ ఈ రోజు వచ్చి వైఎస్ఆర్ సీపీ కండువా వేసుకున్నట్లు స్పష్టం చేశారు.

రికవరీ బంగారం బ్యాంకుకు అప్పగింత



బ్యాంకు వద్ద ఖాతాదారులతో మాట్లాడుతున్న సీఐ, పోలీసులు

గార: గతేడాది నవంబర్ చివరి వారంలో గార స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు మాయమైన సంగతి తెలిసిందే. ఈ కేసులో బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై కేసు నడవడం, బంగారాన్ని అప్పగించాలని బ్యాంకు కోరడంతో కోర్టు ఆదేశాల మేరకు బుధవారం బ్యాంకు అధికారులకు పోలీసులు బంగారం అప్పగించారు. గతంలోనే 26 ప్యాకెట్లు లభించగా.. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి మరో 62 ప్యాకెట్ల బంగారం పట్టుకున్నారు. ఈ మొత్తం బంగారాన్ని డీఎస్పీ శృతి, సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్సై కె.కృష్ణప్రసాద్‌లు బ్యాంకుకు వెళ్లి అప్పగించారు. ఈలోగా పలువురు ఖాతాదారులు బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. వారిని పోలీసులు, సిబ్బంది సముదాయించారు.

ఆర్ట్స్ కళాశాలలో స్కిల్ క్వెస్ట్



స్టాల్ వివరాలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థి దశలోనే విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలలో స్కిల్ క్వెస్ట్ (ఎంటర్, ఎక్స్‌ప్లోర్, ఎర్న్) పేరిట విద్యార్థులు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారు. మంత్రి ధర్మాన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన ఫలితాల కోసం అధ్యాపక బృందం చేస్తున్న కృషిని కొనియాడారు. సరైన ఆలోచన, శిక్షణ ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు. పెరుగుతున్న జనాభాతో పాటు ఉద్యోగాల కొరత ఏర్పడిందని, ఈ తరుణంలో సరైన నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా కాకుండా ప్రైవేటు జాబ్‌లు చేసేందుకు కూడా యువత సిద్ధంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ మాట్లాడుతూ స్కిల్ క్వెస్ట్ కార్యక్రమ ఉద్దేశం వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, విద్యావేత్త సురంగి మోహన్‌రావు, లుకలాపు గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డాక్టర్ హరిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు

- క్యాన్సర్, గుండె, నరాలు, కిడ్నీలకు స్థానికంగానే చికిత్సలు
- 10 మంది వైద్యులు చేరిక
- త్వరలో మరో ఆరు పోస్టులు భర్తీ

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ మెడికల్ కళాశాలలో గురువారం నుంచి నూతనంగా స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కార్డియాలజీ, న్యూరాలజీ, అంకాలజీ వంటి విభాగాల్లో గతంలోనే పోస్టులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. వీటిని కొద్ది రోజుల క్రితం భర్తీ చేయడంతో 10 మంది వైద్యులు విధుల్లో చేరారు. వీరికి గదులు కూడా కేటాయించడంతో గురువారం నుంచి వైద్య సేవలు అందించనున్నారు. ఆయా వ్యాధులకు సంబంధించిన ఓపీ ప్రారంభం కానుంది. దీంతో గుండె మార్పిడి శస్త్రచికిత్సలు, స్టంట్లు, క్యాన్సర్ శస్త్రచికిత్సలు, కిమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సలు జరగనున్నాయి. మరో ఆరు స్పెషాలిటీ వైద్యుల పోస్టులు కూడా త్వరలోనే భర్తీ చేయనున్నారు.

నేటి నుంచి ప్రారంభం

ఈ విషయమై రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వామినాయుడు మాట్లాడుతూ గురువారం నుంచి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలంతో కలసి తాను ఈ సేవలను ప్రారంభిస్తామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● మాతృభాషకు వందనం



అమ్మభాష కమ్మదనం తెలుగుజాతి గొప్పతనమంటూ జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కవిటిలోని కల్యాణి పాఠశాలలో చిన్నారులు అ, ఆ అక్షరాల్లో ఏర్పడి ఆకట్టుకున్నారు. - కవిటి

మహాశివరాత్రికి ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: మార్చి 8న జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా దేవదాయశాఖ అధికారి బి.ఆర్.వి.వి.ప్రసాద్ పట్నాయక్ బుధవారం తెలిపారు. రావివలస ఎండల మల్లికార్జునస్వామి, శ్రీముఖలింగం, ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయాల్లో క్యూలైన్ల ఏర్పాట్లు చేయనున్నామని, ఈ విషయమై త్వరలో ఈవోలతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎనర్జీ అసిస్టెంట్‌కు గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని తలగాం సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టెక్కలి శ్రీనివాసనగర్‌కు చెందిన ఎండ దిలీప్ విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. పెద్దరోకలపల్లి పంచాయతీ రామ్‌నగరంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో సరిచేసేందుకు దిలీప్ సిబ్బందితో కలిసి వెళ్లాడు. ఏబీ స్విచ్ ఆపి లైన్ సరిచేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.